క్లుప్తంగా

నేడు పింఛన్ల తనిఖీ

క్రోసూరు: మంచానికి పరిమితమైన పింఛన్‌దారులను అర్హతను తనిఖీ చేసేందుకు డాక్టర్ల బృందం సోమవారం వస్తున్నట్లు ఎంపీడీవో జి.శ్రీనివాస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 15 సచివాలయాల పరిధిలో మొత్తం 15 మంది బెడ్ రిడెన్ పింఛన్ దారులున్నారని, వారి వాస్తవ పరిస్థితులను పరిశీలించేందుకు వైద్య బృందం వస్తున్నట్లు తెలిపారు.

21న పింఛన్ల తనిఖీ

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలో అనారోగ్య, దివ్యాంగ పింఛనుదారులను తనిఖీ చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలో తనిఖీ చేసేందుకు ఈ నెల 21న వైద్య బృందం రానుందని పేర్కొన్నారు. అనారోగ్యంతో రూ.15 వేలు పింఛన్లు పొందుతున్న వారు 8 మంది ఉన్నారని, వారి ఇళ్లకు వెళ్లి తనిఖీ చేయడం జరుగుతుందని తెలిపారు.

అనాథశ్రమానికి బియ్యం వితరణ



సత్తెనపల్లి: పట్టణంలోని సాధన అనాథ వృద్ధులు ఆశ్రమానికి విలియం కేరీ మెమోరియల్ స్వచ్ఛంద సేవా సంస్థ, 8వ వార్డు క్రిస్టియన్ పేట కమిటీ సభ్యులు ఆదివారం 25 కేజీల బియ్యం వితరణ చేశారు.ఈ సందర్భంగా ప్రత్తిపాడు తహసీల్దార్ గుజ్జర్లపూడి కరుణకుమార్ మాట్లాడుతూ అనాథ వృద్ధులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు గుజ్జర్లపూడి లాభాను, గుజ్జర్లపూడి మనోజ్‌కుమార్, బంకా బాబురావు, గుజ్జర్లపూడి చిన్నకృపారావు, గుజ్జర్లపూడి యోహాను తదితరులు పాల్గొన్నారు.

అభ్యంతరాల స్వీకరణకు నేడు ఆఖరు

సత్తెనపల్లి: ప్రభుత్వ ఆదేశాల మేరకు షెడ్యూల్ కులాల సర్వేపై ప్రస్తుతం సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నందున సంబంధిత ముసాయిదా జాబితాపై అభ్యంతరాలుంటే సోమవారం లోపు తెలియజేయాలని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 26న పట్టణంలోని అన్ని సచివాలయాల్లో ప్రచురించినట్లు వెల్లడించారు. అభ్యంతరాలను ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేయవచ్చని పేర్కొన్నారు. అభ్యంతరాలపై విచారణ చేసి తుది జాబితాను ఈ నెల 10న ప్రచురిస్తామని తెలిపారు.

విశ్రాంత ఉపాధ్యాయులకు సత్కారం



సత్తెనపల్లి: నరసరావుపేటలో ఏపీ రాష్ట్రోపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నూతన భవన ప్రారంభోత్సవం జరిగింది. ఈ సందర్భంగా సత్తెనపల్లికి చెందిన ఇద్దరు విశ్రాంత ఉద్యోగులు సలగాల మృత్యుంజయారావు, కేబీఆర్‌జే ప్రసాద్‌లను సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరావు యూనియన్ రాష్ట్ర నాయకులు సత్కరించారు. యూనియన్ రాష్ట్ర నాయకులు జోసెఫ్ సుధీర్, చంద్రజిత్ యాదవ్, కోటేశ్వరరావు ఇద్దరి సేవలను కొనియాడారు.

వ్యక్తి ఆత్మహత్యా యత్నం

నకరికల్లు: కేసు విషయమై రోజు పోలీసు స్టేషన్‌కు పిలిపిస్తున్నారంటూ మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి పోలీసు స్టేషన్ ఎదుట ఆదివారం ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. నకరికల్లుకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త దేపంగి వెంకట్రావు, మరొక వ్యక్తికి మధ్య గత కొన్ని రోజుల క్రితం ఘర్షణ జరిగింది. దీంతో వెంకట్రావుపై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కొన్ని రోజులుగా పోలీసు స్టేషన్‌కు రోజు పిలిపిస్తున్నారని మనస్తాపానికి గురైన వెంకట్రావు ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన నరసరావుపేట ఏరియా వైద్యశాలకు అతనిని తరలించారు. ఈ విషయమై ఎస్‌ఐ చల్లా సురేష్‌ను వివరణ కోరగా ఇద్దరి మధ్య ఘర్షణ నేపథ్యంలో ఫిర్యాదు మేరకు విచారణ చేసి స్టేషన్ బెయిల్‌కు సిద్ధం చేస్తున్నామని వివరణ ఇచ్చారు.

అల్లుకున్న నిర్లక్ష్యం



నాదెండ్ల: మేజర్ పంచాయతీ గణపవరంలోని సింగువారివీధిలో ఓ విద్యుత్ స్తంభానికి పిచ్చి మొక్కలు అల్లుకుని ప్రమాదభరితంగా మారింది. స్తంభం నుంచి పది వరకూ కనెక్షన్లు ఉన్నాయి. గత కొద్దిరోజులుగా వర్షం కురిసినా, గాలులు వీచినా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా విద్యుత్ స్తంభాలు శుభ్రం చేసి తగు చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

వసతి గృహంలో వణుకు

- కనీస వసతుల్లేక విద్యార్థులకు తప్పని వెతలు
- అద్దె భవనాల్లో మరిన్ని ఇబ్బందులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- నియోజకవర్గంలో 8 వసతి గృహాలు, 3 గురుకులాలు



మంచాలు లేక నేలపై నిద్రిస్తున్న విద్యార్థులు



రాజుపాలెం బీసీ బాలుర వసతి గృహంలో అధ్వానంగా మరుగుదొడ్లు, తలుపులు



నిర్మలానగర్‌లో బీసీ బాలుర వసతి గృహంలో తువ్వాలే..కిటికీ

సత్తెనపల్లి: సంక్షేమ వసతి గృహాల విద్యార్థులు చలితో వణుకుతున్నారు. కిటికీలు, తలుపులు సరిగ్గా లేక చలిగాలి నేరుగా గదుల్లోకి వస్తోంది. విద్యార్థులు రాత్రుళ్లు చలి తీవ్రతను తట్టుకోలేక అల్లాడుతున్నారు. వసతి గృహాల్లో మంచాలు, పరుపులు లేక విద్యార్థులు నేలపైనే చాప వేసుకుని పడుకుంటున్నారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో 8 వసతి గృహాలు, మూడు గురుకులాల్లో మొత్తం 2,513 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. ఆయా వసతి గృహాల్లో సరైన సదుపాయాలు కల్పించలేదు. కప్పుకోవడానికి మందపాటి దుప్పట్లు విద్యార్థులు అందజేయలేదు. గతేడాది దుప్పట్లు పంపిణీ చేసినా ఈ ఏడాది ఇంకా ఇవ్వలేదు. విద్యార్థులు ఇళ్ల నుంచి దుప్పట్లు తెచ్చుకుంటున్నారు. ఆ స్తోమత లేని వారు వణుకుతూ పడుకుంటున్నారు. ఎముకల కొరికే చలి.. మరోవైపు దోమలతో విద్యార్థులు నిద్రకు దూరమవుతున్నారు. వసతి గృహాల మరుగుదొడ్లకు తలుపులు కూడా లేకపోవడం, అధ్వాన పారిశుద్ధ్య పరిస్థితులు ఉన్నప్పటికీ అటు పాలకులు .. ఇటు అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రధానంగా వసతి గృహాలు అద్దె భవనాల్లో ఉన్నాయి. వసతులు లేకున్నా భవన యజమానులు పట్టించుకోవడం లేదు. అధికారులు కూడా దాటవేత ధోరణి అవలంబిస్తున్నారు. రెండు గురుకులాల్లో మినహా మిగిలిన వసతి గృహాలు, మాదల బీసీ గురుకులంలో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.

నియోజకవర్గంలో వసతి గృహాలు ఇలా..

సత్తెనపల్లిలోని నాగార్జుననగర్‌లో బీసీ బాలుర, రఘురామ్ నగర్‌లో బీసీ బాలికల, నిర్మలా నగర్‌లో ఎస్సీ కళాశాల బాలుర, వెంకటపతి నగర్‌లో ఎస్సీ కళాశాల బాలికల, పార్క్ ఏరియాలో బీసీ కళాశాల బాలికల, నిర్మలా నగర్‌లో బీసీ బాలుర(ప్రీ మెట్రిక్), రఘురామ్ నగర్‌లో బీసీ బాలికల(ప్రీమెట్రిక్), రామకృష్ణాపురం ఏపీ ఎస్‌డబ్ల్యూఆర్ బాలికల, రామకృష్ణాపురం ఏపీ ఎస్‌డబ్ల్యూఆర్ బాలుర, మాదలలో ఎంజేపీ బాలికల గురుకుల, రాజుపాలెంలో బీసీ బాలుర వసతి గృహాలున్నాయి.

ధరలు కనిపించవు..సమాచారం ఉండదు



పెదకూరపాడు గిడ్డంగిలో సమాచారం లేని బోర్డు



ఎరువుల దుకాణంలో ఇలా..

పెదకూరపాడు: ఎరువులు, పురుగు మందులు దుకాణాలు, పౌర సరఫరాల గోదాములు, వ్యవసాయ శాఖ, ఉపాధి హామీ పథకం బోర్డులపై సమాచారం కనిపించడం లేదు. దీంతో ప్రజలకు, వినియోగదారులకు ధరల వివరాలు తెలియరావడం లేదు. ఇష్టానుసారంగా వ్యాపారులు విక్రయాలు జరుపుతున్నారు. పెదకూరపాడు మండలంలోని అన్ని దుకాణాల్లో స్టాక్ బోర్డులపై ధరలు కనిపించడం లేదు. పౌరసరఫరాల గిడ్డంగులు వద్ద కూడా ఇదే పరిస్థితి నెలకొంది. వ్యవసాయ సూచనల బోర్డులు కూడా ఖాళీగా ఉన్నాయి.

ఎస్టీయూ నేతలకు సత్కారం



వినుకొండ(నూజెండ్ల): నరసరావుపేటలోని పల్నాడు జిల్లా ఎస్టీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన వార్షిక కౌన్సిల్ సమావేశంలో వినుకొండ నియోజకవర్గానికి చెందిన ఎస్టీయూ నాయకులను ఘనంగా సత్కరించారు. నాయకులు గంటా నాగేశ్వరావు, ఆకుల శ్రీనివాసరావు, వల్లెపు శ్రీరాములు, కె.బాలకృష్ణరావును సన్మానించారు.

శావల్యాపురంలో...

నరసరావుపేట ఎస్టీయూ కార్యాలయంలో ఆదివారం మండల శాఖ అధ్యక్షులు బిళ్లా రాజారమేష్, కార్యదర్శి కంప శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షులు కొండ్రముట్ల వెంకటరత్నంను ఘనంగా సత్కరించారు. ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి మాట్లాడుతూ సంఘ కార్యకలాపాలను విజయవంతం చేసి, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించే దిశగా నేతలు పని చేయాలని తెలిపారు. సీపీఐ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, పూర్వ అధ్యక్షులు జోసఫ్‌సుధీర్‌బాబు, జిల్లా అధ్యక్షులు చంద్రజిత్‌యాదవ్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

● ఇలా అయితే నెట్టుకురావడం కష్టమే



విరిగిన చెత్త సేకరణ డబ్బాలు

పెదకూరపాడు: విరిగిన చెత్త సేకరణ డబ్బాలు.. మరమ్మతులకు వచ్చిన రిక్షాలు.. రోజు రోజుకు పెరుగిపోతున్న చెత్తతో తీవ్ర ఇబ్బందులు. ఇదీ పెదకూరపాడులోని పారిశుద్ధ్య కార్మికుల ఆవేదన. నెలలు తరబడి ఈ ఇబ్బందులు పడుతున్నా..అధికారులకు మొత్తుకుంటున్నా పట్టించుకోవడం లేదనేది వారి ఆగ్రహం, అసహనం. గ్రామంలో రోజు మార్చి రోజు చెత్త సేకరణకు వెళ్తుంటే 10 గృహాల చెత్తకే ఉన్న డబ్బాలు నిండుకుంటున్నాయని, కొత్త డబ్బాలు ఇప్పించాలని అధికారులను వేడుకుంటున్నారు. మరో వైపు రిక్షాలు మరమ్మతులకు వచ్చాయని, వాటితో 'నెట్టుకు'రావడం ఇబ్బందిగా మారిందంటున్నారు. ఇలా అయితే చెత్త సేకరణ చేయమని హెచ్చరిస్తున్నారు.

ముగిసిన ఓటరు జాబితా సవరణ

- 2,42,143కు చేరిన సత్తెనపల్లి నియోజకవర్గ ఓటర్లు
- ముసాయిదా జాబితా కంటే 3,056 మంది పెరిగిన వైనం
- నేడు నియోజకవర్గ తుది ఓటర్ల జాబితా విడుదల



సవరణ ప్రక్రియలో అధికారులకు సూచనలిస్తున్న ఈఆర్‌ఓ జీవీ రమణకాంతరెడ్డి(ఫైల్)

సత్తెనపల్లి: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు జాబితా సవరణ–2025 ప్రక్రియ ముగిసింది. గత ఏడాది అక్టోబర్ 29న ముసాయిదాను నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, సత్తెనపల్లి ఆర్డీవో జీవీ రమణకాంతరెడ్డి ప్రకటించారు. ఆ రోజు నుంచి నవంబర్ 28వ తేదీ వరకు నెల రోజుల పాటు ఓటరు జాబితా సవరణ ప్రక్రియ చేపట్టారు. ఓటు నమోదుకు, ఓటు తొలగింపునకు, ఓటు వివరాల మార్పునకు దరఖాస్తులు స్వీకరించారు. నియోజకవర్గంలోని ఒక పట్టణం, నాలుగు మండలాల పరిధిలో 4,031 దరఖాస్తులు అందగా 357 తిరస్కరణకు గురయ్యాయి. 3,674 ఆమోదం పొందాయి.

నియోజకవర్గంలో దరఖాస్తులు ఇలా..

- ఓటు నమోదుకు (ఫాం–6) 3,329 దరఖాస్తులు అందగా 312 తిరస్కరించారు. 3,017 ఆమోదించారు.
- ఓటు తొలగింపునకు (ఫాం–7) 246 దరఖాస్తులు వచ్చాయి. 19 దరఖాస్తులు తిరస్కరించారు. 227 ఆమోదించారు.
- ఓటు వివరాల మార్పునకు (ఫాం–8) 456 దరఖాస్తులు రాగా 26 దరఖాస్తులు తిరస్కరించారు. 430 ఆమోదించారు.

నియోజకవర్గంలో 2,42,143 కు చేరిన ఓటర్లు ...

ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకారం నియోజకవర్గంలో 2,39,087 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 1,17,113 మంది, మహిళా ఓటర్లు 1,21,960 మంది, థర్డ్ జెండర్ ఓటర్లు 14 మంది ఉన్నారు. తుది ఓటరు జాబితా ప్రకారం 2,42,143 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 1,18,442 మంది, మహిళా ఓటర్లు 1,23,689 మంది, థర్డ్ జెండర్ ఓటర్లు 12 మంది ఉన్నారు. ముసాయిదాకు .. తుది ఓటరు జాబితాను పరిశీలిస్తే 3,056 మంది ఓటర్లు పెరిగారు. పురుషుల కంటే మహిళలు 5,247 మంది అధికంగా ఉన్నారు.

వయస్సుల వారీగా ఓటర్లు ....

నియోజకవర్గంలో వయస్సుల వారీగా ఓటర్లను పరిశీలిస్తే .. 18–19 ఏళ్ల ఓటర్లు 2,775, 20–29 ఏళ్ల మధ్య ఓటర్లు 42,807, 30–39 ఏళ్ల మధ్య 60,486, 40–49 ఏళ్ల మధ్య 55,037, 50–59 ఏళ్ల మధ్య 40,079, 60–69 ఏళ్ల మధ్య 24,952, 70–79 ఏళ్ల మధ్య 12,015, 80–89 ఏళ్ల మధ్య 3,500, 90–99 ఏళ్ల మధ్య ఓటర్లు 493 మంది ఉన్నారు.

నేడు తుది జాబితా ప్రకటన..

ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకారం తుది ఓటరు జాబితాను సోమవారం ప్రకటిస్తారు. ఓటరు జాబితా ప్రచురణను ఎన్నికల కమిషన్ అనుమతిని ఈ నెల ఒకటిన తీసుకొని ముద్రణ ప్రక్రియ చేపట్టారు. నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, ఆర్డీవో జీవీ రమణకాంతరెడ్డి విడుదల చేస్తారు.

తుది జాబితా ప్రకారం నియోజకవర్గంలో ఓటర్ల వివరాలు

మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
సత్తెనపల్లి టౌన్	23,157	24,841	05	48,003
సత్తెనపల్లి రూరల్	30,045	31,592	-	61,637
ముప్పాళ్ల	17,475	18,261	01	35,737
రాజుపాలెం	20,800	21,740	04	42,544
నకరికల్లు	26,965	27,255	02	54,222
మొత్తం	1,18,442	1,23,689	12	2,42,143

దీక్షాదక్షతే లక్ష్య సాధనకు దిక్సూచి



విద్యార్థులకు మోటివేషన్ క్లాసు నిర్వహిస్తున్న కాళహస్తి సుబ్బారావు

యడ్లపాడు: దీక్షాదక్షత లేకుండా మనిషి జీవితంలో ఏది సులభంగా రాదని చెన్నై వివేకానంద ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిష్ ఫ్యాకల్టీ కాళహస్తి సుబ్బారావు చెప్పారు. మండలంలోని లింగారావుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 9,10 విద్యార్థులకు మోటివేషన్ తరగతుల్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన విద్యార్థులకు విలువైన విషయాలపై చైతన్యం కలిగించారు. ప్రధానంగా తొమ్మిది లక్షణాలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. దూరదృష్టి, చదువుపై ఆసక్తి, క్రమశిక్షణ, ఉన్నతస్థాయికి ఎదగాలనే బలమైన కోరిక, విద్యా సంబంధమైన నైపుణ్యాలు పెంపొందించుకోవాలని తెలిపారు. సరైన వైఖరి, సమయపాలన, వినయం, నిరంతర కృషి లక్షణాలు ప్రాథమిక దశ నుంచే విద్యార్థులు పెంపొందించుకోవడం ద్వారా ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.వి. రామిరెడ్డి, ఉపాధ్యాయులు డి. సుధాకర్, యు. మల్లేశ్వరి, గ్రామ పెద్దలు నంబూరు శివరామకృష్ణయ్య, గోగడ హరిబాబు, గుంటుపల్లి రమణయ్య పాల్గొన్నారు.

నేడు బస్టాండ్ రోడ్డులో ఆక్రమణల తొలగింపు


అధికారుల హెచ్చరికతో కొంతమంది వ్యాపారులు స్వచ్ఛందంగా తొలగింపు



రేకుల షెడ్లను కూలీలతో తొలగిస్తున్న యజమానులు

నరసరావుపేట: మున్సిపల్ అధికారులు పట్టణంలోని రోడ్ల మార్జిన్లలో ఆక్రమణ తొలగింపు పునఃప్రారంభించనున్నారు. వినుకొండరోడ్డులో ఆక్రమణల తొలగింపు పూర్తిచేసిన అధికారులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పర్యటనను పురస్కరించుకొని వారం పాటు నిలిపివేశారు. సోమవారం నుంచి ప్రకాష్‌నగర్‌లోని రిక్షా సెంటర్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలను తొలగిస్తామని టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ పి.సాంబయ్య పేర్కొన్నారు. మూడురోజుల ముందుగానే ఆక్రమణదారులకు తెలియజేశామన్నారు. ఆ రోడ్డులోని కొంతమంది ఆక్రమణదారులు ముందస్తుగా ఆదివారం స్వచ్ఛందంగా రోడ్డుపైకి వేసిన రేకుల షెడ్లు, కూరగాయల షాపులు తొలగించారు. మరికొందరు మున్సిపాల్టీ అధికారులు వచ్చినప్పుడు తొలగించుదాములే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. గత ఐదేళ్ల నుంచి ఈ మార్గంలో వ్యాపార దుకాణాలు విరివిగా ఏర్పాటు చేశారు. సమీపంలోనే విద్యార్థుల హాస్టళ్లు ఉండటం, బస్టాండ్ నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లేమార్గం కావటంతో ప్రయాణికుల రాకపోకలతో రద్దీగా మారింది. మధ్యలో రిక్షాసెంటర్ నుంచి బస్టాండ్ వరకు వ్యాపార సముదాయాలు పెరిగాయి. సాయంత్రం ఆరుగంటల నుంచి తొమ్మిదిన్నర వరకు ఈ రోడ్డులో విపరీతమైన రద్దీ కనిపిస్తుంది. వ్యాపారులు దుకాణాలను మార్జిన్లలో ఏర్పాటుచేసి వాటి ముందు రేకుల షెడ్లు పైకి ఏర్పాటుచేయటంతో వాటి దగ్గరకు వచ్చేవారి వాహనాలు రోడ్లపైనే నిలిపివేస్తున్నారు. దీంతో జనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఈ నేపథ్యంలో ఆక్రమణల తొలగింపు సత్ఫలితాలు ఇస్తుందేమో వేచి చూడాలి.

'వీక్షణం' ఎడిటర్ వేణుగోపాల్‌పై దాడి హేయం



పోస్టర్లు ప్రదర్శిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

నరసరావుపేట: వీక్షణం ఎడిటర్ వేణుగోపాల్‌పై దాడిని ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలని ప్రజాసంఘాల నాయకులు కోరారు. ఆదివారం స్థానిక స్టేడియం దగ్గర దాడిని ఖండిస్తూ పోస్టర్లు ప్రదర్శించారు. ఈ సందర్భంగా దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) రాష్ట్ర నాయకుడు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత నెల 29న హైదరాబాదు బుక్ ఫెస్టివల్‌లో షాపు నిర్వహిస్తున్న వీక్షణం బుక్ స్టాల్‌లో హిందూత్వంపై వ్యతిరేకించే పుస్తకాలున్నాయని కొందరు ఘర్షణకు దిగి, దుర్భాషలాడినట్లు తెలిపారు. యూట్యూబ్ ఛానల్‌లో అసభ్యకరంగా, రౌడీల్లాగా, చట్టవ్యతిరేకంగా పోస్టులు పెడుతూ బెదిరింపులకు దిగారని చెప్పారు. ఇలాంటి శక్తులు గతంలో కూడా గౌరీ లంకేష్, కల్బుర్గి లాంటి మేధావులను హత్య చేశారని తెలిపారు. చట్టబద్ధ పాలనని, చట్టాన్ని గౌరవిస్తున్నామని పేరుతో ఇలాంటి శక్తుల్ని ప్రోత్సహిస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను ఖండించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వి. కోట నాయక్, పీడీఎం నాయకులు నల్లపాటి రామారావు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ మస్తాన్‌వలి, జి.రామకృష్ణ, పౌర హక్కుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చికినం చిన్న, బీసీ నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం

బొల్లాపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో పి. సీతారామయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సమావేశం ప్రారంభం కానుందని పేర్కొన్నారు. వివిధ శాఖల ప్రగతి, అభివృద్ధి కార్యక్రమాలపై సమావేశంలో సమీక్ష ఉంటుందని, సంబంధిత ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, సిబ్బంది హాజరుకావాలని ఆయన సూచించారు.

సేవకు ప్రతిరూపం ఇన్నర్ వీల్ క్లబ్

క్లబ్ డిస్ట్రిక్ చైర్మన్ ప్రేమలత

చిలకలూరిపేట: సేవకు ప్రతిరూపం ఇన్నర్ వీల్ క్లబ్‌అని క్లబ్ డిస్ట్రిక్ చైర్మన్ ప్రేమలత చెప్పారు. ఇన్నర్ వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో డిస్ట్రిక్ చైర్మన్ ఆఫీషియల్ విజిట్ కార్యక్రమంలో భాగంగా ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రోటరీ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రేమలత మాట్లాడారు. క్లబ్ సభ్యులు సొంతనిధులు వెచ్చించి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయం అన్నారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఫ్రీ మెడికల్ క్లినిక్‌కి రూ.10వేలు విలువ చేసే మందులను ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షరాలు గట్టు సరోజిని అందజేశారు. కావూరు జెడ్పీ హైస్కూల్‌కు వాలీబాల్ కిట్‌ను, స్థానిక చౌదరయ్య స్కూల్లో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థినికి రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. ఇద్దరు పేద మహిళలకు రెండు కుట్టుమిషన్లు అందజేశారు. వృద్ధాశ్రమ నిర్మాణానికి రూ.లక్ష అందించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి నార్నె విజయలక్ష్మి, దండా శేషమాంబ, రమాదేవి పాల్గొన్నారు.

దిక్కూమొక్కూ లేని ప్రాథమిక పాఠశాల

- అసాంఘిక కార్యకలాపాలకు నిలయం
- ఆవరణంతా అపరిశుభ్రత
- పాఠశాలలో మందుబాబుల ఆగడాలు



మేళ్లవాగు రెగ్యులర్ ప్రాథమిక పాఠశాల

బొల్లాపల్లి : మండలంలోని మేళ్లవాగులో రెగ్యులర్ ప్రాథమిక పాఠశాల రాత్రి వేళ అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. పాఠశాలలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు 62మంది విద్యార్థులు ఉన్నారు. నాడు–నేడు ఫేజ్ –1లో భాగంగా మౌలిక వసతులు ఏర్పాటయ్యాయి. పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించారు గానీ రెండు వైపులా దారులకు గేట్లు పెట్టకపోవడం వల్ల ఇబ్బందిగా మారింది. రాకపోకలకు అడ్డంకులు లేకపోవడంతో పాఠశాల నుంచే కొందరు రాకపోకలు సాగిస్తుంటారు. పాఠశాలను ఆనుకొని నివాస గృహాలు ఉండటంతో అటుఇటు రాకపోకలు సాగించడంతో బోధనకు ఆటంకం కలుగుతోంది. రాత్రి వేళ మద్యం తాగడం, అక్కడే సీసాలు పగలగొట్టడంతో పాటు పాఠశాల ఆవరణ మొత్తం అపరిశుభ్రంగా మారుతోంది. గ్రామపెద్దలు, దాతలు పాఠశాల అభివృద్ధికి నడుం బిగించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. గేట్లు ఏర్పాటు చేసి అసాంఘిక కార్యకలాపాలను జరగకుండా చూడాలని ప్రధానోపాధ్యాయురాలు కె.సునీత విజ్ఞప్తి చేశారు.

వరి కోత మిషన్ లారీ బోల్తా



వినుకొండ(నూజెండ్ల): వరికోత మిషన్‌ను తీసుకెళ్తున్న లారీ పంట పొలంలోకి దూసుకువెళ్లి బోల్తాపడిన సంఘటన మండల కేంద్రం నూజెండ్ల బీసీ కాలనీ వద్ద ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు మేరకు.. ప్రమాదవశాత్తు లారీ అదుపు తప్పి పొలంలో పడిపోయింది. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు,

వ్యాపారంలో రెడ్లు అభివృద్ధి సాధించాలి



నరసరావుపేట: వ్యాపారంలో ఉన్న రెడ్లు అందరూ ఒకరినొకరు సహకరించుకుంటూ అభివృద్ధి పథంలో పయనించాలని డాక్టర్ నవులూరి క్రాంతికుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ప్రకాష్ నగర్‌లోని ఎల్‌ఐసీ ఏజెంట్ తియ్యగూర వీరారెడ్డి కార్యాలయంలో రెడ్డి బిజినెస్ గ్రూపు(ఆర్‌బీజీ)కు చెందిన నూతన క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. డాక్టర్ క్రాంతికుమార్‌రెడ్డితో పాటు మాజీ కౌన్సిలర్ మాగులూరి రమణారెడ్డి, న్యాయవాది ఆరె శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షులు గానుగపంట ఉత్తమరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రెడ్ల అభివృద్ధికి తామంతా కృషిచేస్తామని పేర్కొన్నారు. అనంతరం ఆర్‌బీజీ రాష్ట్ర స్థాయి ప్రతినిధులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాలు పంచుకున్నారు. స్థానిక ఆర్‌బీజీ ప్రతినిధులు జి.సాంబశివారెడ్డి, యర్రంరెడ్డి నాగేశ్వరరెడ్డి, ఈదా లింగారెడ్డి, టి.శ్రీనివాసరెడ్డి, నుసుం వెంకటరెడ్డితో పాటు పలువురు రెడ్లు హాజరయ్యారు.